# అడుగుల చప్పుళ్లు

అప్పటిదాకా జోరున వర్షం కురిసి ఆగిపోయింది. అర్ధరాత్రి దాటి అప్పటికి అరగంటయింది.

చలికి ముసుగు తన్ని పడుకున్న రామారావు, గాఢనిద్రలో ఉన్నాడు. అప్పటిదాకా ఏవో కబుర్లు చెప్తూ ఉన్న అతని భార్య భారతి అలసిపోయి, తనూ గాఢ నిద్రకి లోనయింది. అపుడు—

వీధిలో చప్పుళ్ళు వినవచ్చాయి, ఉన్నట్లుండి. తపతపమని వర్షం నీటిలోఅడుగులు వేగంగా పడిన ధ్వనులు వచ్చాయి.

రామారావుని చేత్తో తట్టి పిలిచింది—

రామారావు లేచి కూర్చున్నాడు. ''ఏమిటి, భారతీ?'' అన్నాడు నిద్రమత్తులో.

''ఎవరో తలుపు తడుతున్నారండి'' అంది భారతి లైటు వేస్తూ. రామారావు మత్తు వదిలింది.

''ఎవరయి ఉంటారబ్బా?'' అంటూ లేచి, తలుపు తీయటానికి అడుగులు వేశాడు రామారావు.

''ఏమండీ! కొంచం ఆగండి. తొందరపడి తలుపు తీయవద్దు'' అంది భారతి కంగారుగా. ఏమిటన్నట్టు చూశాడు రామారావు భార్యవైపు.

''అర్ధరాత్రి పూట! ఆ వచ్చింది ఎవరో ఏమిటో, తెలుసుకుని, తలుపు తీయండి అంది.'' రామారావు నవ్వాడు. ''ఫర్లేదులే'' అంటూ వెళ్లాడు.

తలుపు తీశాడు. చలికి గజగజ వణుకుతూ, ఒక ఆకారం నిలబడి ఉంది గుమ్మంలో.

''ఎవరూ?'' అన్నాడు రామారావు. ఆ వ్యక్తిని ఆనవాలు పట్టలేక. బయట చీకటివలన.

''నేను లోకనాథాన్ని'' అంటూలోపలికి వచ్చాడు అతను. అతను లోకనాథం. అతన్ని ఆహ్వానిస్తూనే రామారావు ఆశ్చర్యపోయాడు. భారతికూడా సంభ్రమానికి లోనయింది. గబగబాలోనికి వెళ్లి చెంబుతో నీళ్లూ, తువాలూ తెచ్చి అందించింది అనుకోని అతిథికి. లోకనాథం లోనికి వచ్చి, కాళ్లు కడుక్కుని, తువ్వాలుతో తుడుచుకున్నాడు. తడిసిన బట్టలు విప్పి ఆరేశాడు. రామారావు అందించిన లుంగీ కట్టుకున్నాడు.

''చెల్లెమ్మా!'' ఆర్ద్రంగా వుంది ఆ పిలుపు. ఆ చూపుల్లో వుంది యుగాలనాటి వాత్సల్యం. ఆప్యాయంగా చాలా సంవత్సరాల తర్వాత వినపడిన ఆ పిలుపుకి భారతి గుండె పులకరించింది.

''ఆకలిగా వుంది ఏమయినా పెట్టవూ?'' అన్నాడు పసివాడిలాగ లోకనాథం. ఆ మాటకి భారతి మనసుని తోడినట్లు బాధ పడింది. లోపలికి వెళ్లి పొయ్యి అంటించింది.

''అయిదు నిముషాల్లో వంట అయిపోతుంది



కూర్చోబావా!'' రామారావు మర్యాద చేశాడు.

''నువ్వూ కూర్చో'' భేషజంగావే అన్నాడు లోకనాథం సహజ నైజంతో. అగాధం మధ్యన పెట్టుకుని ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. లోకనాథంలో ఎంత మార్పూ?!..

లోతుకుపోయిన కళ్ళు. ఫల్చగా అయిన చెంపలు. మాసిన గడ్డం. అస్థిపంజరంలాగ అయిన శరీరం. అనంతసాగరాల్లాగ తీవ్ర మైన వేదనని ఇముడ్చుకున్న చూపులు.

''ఎలా ఉన్నారూ?'' ముందు తనే పలకరించాడు లోకనాథం, పాడిపాడిగా.

''బాగానే ఉన్నాను భగవంతుడి దయవలన'' వినమ్రంగా అన్నాడు రామారావు.

''ఊ! ఏమిటీ కబుర్లూ?''

''ఏముంటాయి? మామూలే రెక్కలు వచ్చిన పిల్లలు ఎగిరిపోయేరు. మేం మిగిలేం చివరికి.''

''మనం మనం కలుసుకుని సుమారు పది సంవత్సరాలుదాకా అయింది. అయినా ఏమీ అసలు కబుర్లూ కాకరకాయలూ లేవంటున్నావ్! విచిత్రంగా ఉంది!'' ఆశ్చర్యం ప్రకటించాడు లోకనాథం.

''చెలమకీ సముద్రానికీ సంబంధించిన విశేషాలు ఏముంటాయి! నక్కకీ నాగలోకానికీ పొత్తు కుదరదుగదా!'' అన్నాడు. ఆ మాటలు సూటిగా తగిలాయ్. విచారంగా మొహం పెట్టి తలవంచి లోకనాథం గంభీరముద్ర వహించాడు. చాలా సేపు మౌనంగా వుండి పోయాడు. అంతలో ఉన్నట్లుండి వెక్కివెక్కి ఏడ్చాడు లోకనాథం.

రామారావు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి చూశాడు. ఏం అనలేకపోయాడు. కాస్సేపటికి, తమాయించుకుని కళ్లు తుడుచుకున్నాడు లోకనాథం. ''రామారావు! కళ్ళు మూసుకుపోయిన స్వార్థంతో ఒకప్పుడు నేను నా తోడబుట్టిన చెల్లెలికి ద్రోహం చేశాను. పశ్చాత్తాప హృదయంతో ఇపుడు తన అన్న తనని క్షమించమని అడిగితే ఆమె నన్ను క్షమిస్తుందంటావా?'' అన్నాడు దీనంగా.

గాయాల్ని కెలికినట్లుగా బాధపడ్డాడు. ''అహంతో కనులు పొరలు గమ్మినపుడు మనిషి విచిత్రంగా జంతువులాగే ప్రవర్తిస్తాడు. నా విషయంలో అదే జరిగింది. అపుడు నేను అటువంటి రాక్షసుణ్ణి. కానీ, రామారావ్! పరిస్థితులు తారుమారు అయ్యాయి, ఇపుడు నా కంటి పొరలు విడిపోయాయి. నా భ్రమలు తొలగిపోయాయి. జీవితం నాకు చేదు నిజాన్ని చూపింది. భయంకరంగా నా ఎదుట నిల్చింది. చిత్రమైన ఈ పరిస్థితుల్లో ఇపుడు నాలో 'ఆలోచన' చోటుచేసుకుంది. చెల్లెమ్మని చూడాలని పించింది. వచ్చాను'' అన్నాడు.

''అసలు ఏమైంది, బావా?'' రామారావు అడిగాడు సంభ్రమంగా.

''రామారావు! ఇపుడు నాకు పిచ్చివాడిగా ముద్రపడింది. నా మీద దౌర్జన్యం చలాయిస్తున్నారు. వాళ్లు వేటకుక్కల్ని నా మీదకి ఉసిగొల్పుతున్నారు. అవకాశం దొరికితే నన్ను ఖతం చెయ్యాలని వాళ్లు చూస్తున్నారు. ఈ రోజు నా పరిస్థితి దీనాతిదీనంగా అయిందయ్యా! ఆ రోజు నిర్దాక్షిణ్యంగా నా చెల్లెల్ని ఇంట్లోనుండి గెంటేసాను. నిష్కారణంగాపగబట్టి ఆమెని సాధించాలని చూశాను. ఎన్నో రకాలుగా మీకు అన్యాయం చేశాను. ప్రేమించి పెళ్ళి చేసుకున్నారని తరిమితరిమి వేధించాను. ఏం సాధించినట్టూ?

ఆగ్రహింపు అప్పట్లో నాకు ఏదీ? పాప భీతి ఎక్కడా!! రామారావు! ఆ నా పాపమే ఇపుడు

నన్ను వెంటాడుతూ ఉంది'' ఆగాడు లోకనాథం.

''బావా! అంతా మర్చిపోండి. మీమీద మాకేం కోపం లేదు నిజంగా'' అన్నాడు రామారావు.

''ఇంతేగాదు ఇంకా ఎన్నో దుర్మార్గాలు చేశాను. ధన సంపాదనలో పడి మంచినీ, మానవత్వాన్ని మరిచిపోయాను. ఎందర్నో నిలువునా ముంచాను. చేసిన పాపాలు ఊరికే పోతాయా? పోవు. నా పాపాలను నాతోపాటు ఎవరూ పంచుకోలేరుగదా! నా భార్యా, కొడుకులకు నా సంపాదన కావాలి. అంతేగాని, నా పాపాలలో భాగం ఇస్తానంటే ఒప్పుకుంటారా? వాళ్లు ముమ్మాటికీ ఒప్పుకోరు. నా కొడుకులకూ, తండ్రి పోలికే వచ్చింది. వాళ్లు ఈనాడు తండ్రిని మించిన వాళ్లయ్యారు. అందుకే నాకు ఈ గతి పట్టింది. నా వాళ్లు అనుకున్న వాళ్లకు నామీద ఏమీ అభిమానం లేదు. వాళ్లు ఆస్తికోసం ఈ రోజున కన్న తండ్రినే బలి తీసుకొనటానికి సిద్ధమయ్యారు!'' ఆయాసంతో ఆగాడు లోకనాథం. లుంగీ పంచతో కళ్లు వత్తుకున్నాడు.

''ఇపుడు నాకు ఏ ఆశాలేదు. అంతా అయిపోయింది. నేనూ నాదీ అనుకుని, ఆ అహంతో, భ్రమలోపడి విర్రవీగిన కాలం ఇపుడు గతంలో కలిసిపోయింది. నాకు ఏ స్వేచ్ఛాలేదు. నాకు స్వాతంత్ర్యం లేదు. ఈ ప్రపంచలో ఐశ్వర్యమంతటి చెడ్డది మరొకటి లేదు. అది ఎంతటి దుర్మార్గానికైనా వెనుదీయదు. న్యాయాన్యాయాల విచక్షణే ఉండదు. నేనంటే ఏమిటో, ఇపుడు నాకు తెలియజెప్పారు. నాకన్న కొడుకులు, నా భార్యకూడా వాళ్లతో చేతులు కలిపింది. వాళ్లంతా కలిపి నన్ను ఒంటరివాడిని చేశారు.

ఎంతో శ్రమించి, పాపకర్ముడనై, నేను ఇన్నాళ్లూ సాధించిన ఆ సంపాదనని, నోర్మూసుకుని తమకి అప్పగించమని వాళ్లు నన్ను శాసించటం మొదలెట్టారు. కాదు కూడదన్నందుకు నేను వారిదృష్టిలో ద్రోహినయ్యాను. నన్ను ఎలాగైనాసరే అంతంచెయ్యాలని కుట్ర పన్నారు. నేను తాగేనీరూ, తినే ఆహారం, పీల్చేగాలీ విషపూరితం చెయ్యటానికి పన్నాగాలు పన్నారు. యమభటుల్ని నామీదకి ఉసిగొల్పారు. వింటున్నావా రామారావు! చివరకు నా బ్రతుకు ఇలాగైంది. దీనికి కారణం ఏమిటంటావూ?'' ఆక్రోశనగా ప్రశ్నించాడు లోకనాథం.

రామారావు విషాదంగా నవ్వి, ఏదో చెప్పబోయాడు.

ఇంతలో భారతి మాట వినపడింది ''అన్నయ్యా! భోజనానికి రా.''

భోజనం దగ్గర నవ్వుతూ, తుళ్లుతూ కబుర్లు చెప్పాడు లోకనాథం. చెల్లెలితో చిన్ననాటి ముచ్చట్లు చెప్పి ఆ అనుభూతుల్ని నెమరువేసుకున్నాడు. రామారావుతో మాటల్లో జోకులు పేల్చాడు. కడుపునిండా తిన్నాడు. త్రేవుమని త్రేన్చాడు. ''అమ్మయ్య! చాలా కాలం తర్వాత తృప్తిగా భోజనం చేశాను. నీ రుణం ఎలా తీర్చుకోగలను, నా చిన్నారి చెల్లెలా?'' అని అడిగాడు వాత్సల్యంగా. సుమారు నలభై సంవత్సరాల వయస్సుగల ఆ చిన్నారి చెల్లెలు లజ్జితురాలైంది అతని మాటలకి. సంవత్సరాల తరబడి గూడుకట్టిన వేదన గాలికి ఎగిరిపోయింది.

''అన్నా! అటువంటి మాటలు అనవద్దు. బ్రతిమాలుకుంటాను'' అంది బాధపడ్తూ. ఆ అన్నాచెల్లెళ్ల మాటల్ని చిత్రంగా వింటూ ఉండిపోయాడు రామారావు. నిద్రమరిచి చాలాసేపు కబుర్లు దొర్లాయి వారి మధ్యన. ఎక్కడనో తొలికోడి కూ



సింది. అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు హఠాత్తుగానే లేచాడు లోకనాథం.

లుంగీ పంచ వదిలి, ఆరిన బట్టలు తొడుక్కున్నాడు.

''నేను వెళ్తాను చెల్లాయ్! దురదృష్టవంతుడైన ఈ అన్నని క్షమించు. ఈ అన్నగురించిన విషాదవార్త ఎప్పుడైనా నీ చెవినబడితే అభిమానపూర్వకమైన ఒక్క స్వచ్ఛమైన కన్నీటి బొట్టు రాల్చు చాలు. ఇన్నేళ్ల తర్వాత ఇపుడు నీలో అమ్మని చూసుకుని సంతోషపడ్డాను. థాంక్సు చెల్లాయ్, వస్తాను'' అని బయలుదేరాడు.

''ఈ రాత్రివేళ ఎక్కడికీ వెళ్లటానికి వీలులేదు.'' అని అడ్డుపడింది భారతి. కాని ఆమె మాటలు వినిపించుకోలేదు లోకనాథం. రామారావుకూడా ఎన్నో విధాలుగా చెప్పాడు.

గుమ్మంవరకూ వచ్చిన రామారావు చేతిని స్నేహంగానొక్కి ''రామారావు! నేను మీదగ్గర వుండటానికి వీలులేదు. అందువలన మీకు ప్రమాదం ఉంది. అందుకే నా చివరికోరికని తీర్చుకుని నేను వెళ్లిపోతున్నాను. రౌడీలు నా ప్రాణాలు తీయాలని వెంటబడ్డారు. తప్పించుకుని పారిపోయివచ్చాను. అయినా వాళ్లు నన్ను వదలరు. వాళ్లు కాకులుతిరిగి వాళ్లు, వెతికివెతికి నన్నుపట్టుకుంటారు. నన్ను హతంచేయక వదిలిపెట్టరు'' అన్నాడు లోకనాథం. అతని కళ్లల్లో నీరు చిమ్ముకువచ్చింది.

''నేనూ, నా భార్యా, నా కొడుకులూ నాదీ, అని విర్రవీగాను. చివరికి వాళ్లే ఇపుడు నాకు మృత్యుద్వారాలు తెరుస్తున్నారు. దౌర్జన్యంగా నా నుండి సర్వం దోచుకున్నారు వాళ్లు. నాకు పిచ్చి పట్టిందని నలుగురినీ నమ్మించారు. నన్ను పిచ్చాసుపత్రిలో చేర్పించటానికి ప్రయత్నించారు. ఎదురు తిరిగానని రౌడీల్ని పురమాయించి చివరికి నా ప్రాణాల్నే తియ్యాలని నావెంటబడ్డారు.'' ఆవేశంతో మాటలు ఆగిపోయాయి లోకనాథానికి. రామారావు భుజంమీద తలవాల్చి దుఃఖోద్విగ్నుడయ్యాడు లోకనాథం. కాస్సేపటికి తేరుకుని ''రామారావు భారతి నన్ను క్షమించింది. నువ్వుకూడా నన్ను క్షమించాలి. నేను దగాపడినవాణ్ణి. అక్రమానికి గురై ఆక్రోశిస్తున్నవాణ్ణి. ఇదంతా నేను చెపితే ఎవరూ నమ్మరు కానీ ఇది కఠోర వాస్తవం. ఇపుడో ఎప్పుడో భయంకరంగా మృత్యువును కావలించుకొనబోయే నా దీనత్వంపైన కొద్దిగా దయచూపేము నువ్వుకూడా. భగవంతుడు మీ ఇద్దరికీ మేలుచేస్తాడు వెళ్తాను.'' అంటూ స్నేహపూర్వకంగా రామారావు చేతిని వూపి, చీకట్లోకి గబగబా పరుగెత్తాడు లోకనాథం.

రామారావు తలుపులువేసి, వెనుదిరిగాడు. అంతా ఆమె కూడా వింటూనే ఉంది— భారతి మొహంలో శోకం గూడుకట్టుకుంది.

బయట వీధిలో తపతపమని అడుగులచప్పుడు వినవచ్చింది.

ఆ అడుగుల చప్పుళ్లు ఒకవ్యక్తి తాలూకువి మాత్రమేకాదు. భీతితో పరుగెత్తుతున్న ఒక వ్యక్తివీ, వాటితోపాటు అతన్ని వెంటాడుతున్న మరి కొందరివీ కూడా.

ఆ అడుగుల చప్పుళ్ళు వ్యవస్థ వికృత రూపానికి ప్రతిబింబాలు. భయంతో, ఉద్వేగంతో, రామారావు బిగుసుకుపోయాడు.

పాలడుగు వెంకటేశ్వరరావు